ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 3 మే 2024



ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, మే 2: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువును మే 4వ తేదీ వరకు పొడిగించినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. గత మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబడుతాయని కావున ఫీజును చెల్లించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ విషయాన్ని గమనించి ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఫీజు చెల్లించేలా చూడాలని ఆయన తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

నగదు పట్టివేత

- ముమ్మరంగా వాహనాల తనిఖీ
- రూ.7.44 లక్షలు స్వాధీనం

ఖిల్లా, మే 2: నగరంలో పోలీసులు గురువారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.7.44 లక్షల నగదును పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవార్ ఆదేశాల మేరకు.. గురువారం సాయంత్రం నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గంజ్ ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో నేతి శ్రావణ్ అనే వ్యక్తి వద్ద రూ.4లక్షలు లభించాయి. వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న శ్రావణ్ వాహనాన్ని తనిఖీ చేయగా.. ఆయన వద్ద ఎటువంటి ఆధారాలు లేని నగదును గుర్తించినట్టు ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. నగదును స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కోసం ఎన్నికల అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. అలాగే నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని శివాజీనగర్‌లో రూ.3లక్షల 44వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. నగర ఇన్‌స్పెక్టర్ నరహరి నేతృత్వంలో సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా వాహనంపై వెళ్తున్న చెన్న శివకుమార్ వాహనాన్ని తనిఖీ చేయగా ఆయన వద్ద నగదు లభించింది. లభించిన నగదుకు ఎలాంటి ఆధారాలను సదరు వ్యక్తి చూపకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.



వానాకాలం సాగుకు యంత్రాంగం కసరత్తు



- జిల్లాలో ముందుగానే వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా పంపిణీకి శ్రీకారం
- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా విత్తనాల పంపిణీ

నిజామాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం సాగు కోసం అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే వానాకాలం యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసిన అధికారులు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. సాగు కోసం ముందుగానే విత్తన పంపిణీ మొదలు పెట్టారు. జిల్లాలో వచ్చే వానాకాలం ఎక్కువగా వరిసాగే అవుతుందని అంచనా వేయడంతో ఎక్కువ మొత్తంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా విత్తనాల పంపిణీ మొదలు పెట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా ఈ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. వరి, సోయాబీన్‌తో పాటు జైంచా విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. ఈనెల ఆఖరిలోపు అవసరమైన మరిన్ని విత్తనాలు తెప్పించి పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతుల విస్తీర్ణంకు అనుగుణంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. వచ్చే వానాకాలం దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే ఎరువులను నిల్వ ఉంచడంతో పాటు ఎక్కువగా రైతులు ఉపయోగించే యూరియాను జిల్లాకు కోటా ప్రకారం ఈనెల తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరగనున్న వానాకాలం సాగు విస్తీర్ణం

జిల్లాలో ఈ వానాకాలం పంటల విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వచ్చే వానాకాలంలో 5లక్షల 52,128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఈ విస్తీర్ణంలో 75 శాతానికి పైగా వరిసాగు అవుతుందని అంచనాకు వచ్చారు. వచ్చే వానాకాలంలో నీటి వనరులతో పాటు భూగర్భ జలాలు పెరిగి ప్రాజెక్టులు, చెరువులు నిండితే ఎక్కువ మొత్తంలో వరిసాగు అవుతుందని అంచనాకు వచ్చారు. జిల్లా పరిధిలో రెండు ముఖ్యమైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టు ఉండటంతో ఈ సాగు పెరుగుతుందని అంచనాకు వచ్చారు. ముందస్తుగానే ప్రభుత్వానికి నివేదించారు. వరితో పాటు సోయాబీన్ 51,478 ఎకరాల్లో, మొక్కజొన్న 41,909 ఎకరాలు, పసుపు 19,606 ఎకరాలు, పత్తి 3,273 ఎకరాలు, కందులు 1,444 ఎకరాలు సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. వీటితో పాటు ఇతర పంటలు 3,868 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు. విత్తనాలు, ఎరువులు కావాలని ప్రభుత్వానికి నివేదించారు.

విత్తన పంపిణీకి ఏర్పాట్లు

ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విత్తన పంపిణీ ఉమ్మడి జిల్లా పరిధిలో చేపట్టింది. జూన్ ఆరంభం నుంచే రైతులు విత్తనాలు వేయనుండటంతో ఈ పంపిణీ చేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో మే నెలలోనే నారుమల్లు పోసి జూన్ ఆరంభం నుంచే నాట్లు రైతులు వేస్తుండటంతో వరికి సంబంధించిన విత్తనాలు ఎక్కువ మొత్తంలో పంపిణీ చేస్తున్నారు. వానాకాలంలో వివిధ రకాల కంపెనీల విత్తనాలను రైతులు ఎక్కువగా వినియోగిస్తున్న వరి ఎక్కువ విస్తీర్ణంలో ఈ సంవత్సరం సాగు అవుతుందని అంచనా వ్యవసాయ శాఖ అంచనా వేయడంతో ముందస్తుగా ఈ పంపిణీ విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు చేపట్టారు. వానాకాలంలో సాగుకు అనుకూలంగా లక్షా 29,165 క్వింటాల విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ అంచనాకు రావడంతో విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాలతో పాటు ఇతర విత్తనాలను కూడా పంపిణీకి ఏర్పాట్లను చేశారు. వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగా ప్రస్తుతం విత్తనాభివృద్ధి సంస్థ ఉన్న విత్తనాలను బట్టి పంపిణీ మొదలు పెట్టారు. బీపీటీ 5204 రకం 1035 క్వింటాలు, కెఎన్‌ఎం 1638 రకం 6775 క్వింటాలు, ఆర్ఎన్ఆర్ 15048 రకం 350 క్వింటాలు, ఎంటీయు 1010 రకం 4010 క్వింటాలు ప్రస్తుతం అందుబాటులో ఉండగా పంపిణీ చేస్తున్నారు. మరికొంత స్టాక్ రాగానే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సీడ్ బీపీటీ రకం 25కిలోల బ్యాగును 1030 రూపాయలకు, ఎంటీయు 1010 రకం 987 రూపాయలకు, కెఎన్ఎం 995 రూపాయలకు అందిస్తున్నారు. ఈ విత్తనాలే కాకుండా సోయాబీన్ కూడా కొద్దిమొత్తంలో స్టాక్ ఉండటంతో పంపిణీ చేస్తున్నారు. సోయాబీన్ కెడిఎస్ 726 రకం 30 కిలోల బ్యాగును 2520 రూపాయలకు, సోయాబీన్ ఎంఎయుఎస్ రకం 2520 రూపాయలకు అందజేస్తున్నారు. ఇవే కాకుండా ఇతర విత్తనాలను కూడా తీసుకువచ్చి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో 21వేల క్వింటాల వరి విత్తనాలు, 3వేల క్వింటాల సోయాబీన్ విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. వీటితో పాటు రైతులు పంటలకు ముందుగా పొలాల్లో వేసే జైంచా విత్తనాలను కూడా అందించేందుకు సిద్ధమవుతున్నారు. వానాకాలం ఆరంభంలోపే రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న రకాలను అందించనున్నారు. జిల్లాలో వానాకాలం ఆరంభం నాటికి ఈ విత్తనాలను పూర్తిస్థాయిలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవేకాకుండా ప్రైవేటు సంస్థల ద్వారా కూడా వరికి సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచారు. సోయాబీన్‌తో పాటు మొక్కజొన్న ఎక్కువ శాతం రైతులు ప్రైవేటుగా కొనుగోలు చేసి వేస్తున్నారు. వివిధ రకాల విత్తనాలు ఎక్కువ మొత్తంలో ప్రైవేటులోనే అందుబాటులో ఉండటం సర్టిఫైడ్ సీడ్స్‌తో పాటు ఫౌండేషన్ సీడ్ కూడా అమ్మకాలు చేస్తుండటంతో రైతులు ఎక్కువగా దిగుబడి వచ్చే వంగడాల వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. వానాకాలం ఆరంభానికి ముందే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొన్ని రకాల విత్తనాలను రైతులకు అందిస్తున్నామని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం స్టాక్ ఉన్న సీడ్‌తో పాటు మళ్లీ వచ్చే సీడ్‌ను కూడా వెంట వెంటనే పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. జూన్ ఆరంభం నుంచే రైతులు విత్తనాలు వేయనుండటంతో ముందస్తుగా పంపిణీ మొదలు పెట్టామని ఆయన తెలిపారు.

బీడీ కార్మికులందరికీ పింఛన్ వచ్చే విధంగా చూస్తాం

- కటాఫ్ డేట్‌ను ఎత్తివేసి అందరికీ అవకాశం కల్పిస్తాం
- బీడీ కార్మికుల సదస్సులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీడీ కార్మికులకు ఆత్మస్థైర్యాన్ని నింపి అండగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దేశంలో ఏ రాష్ట్రంలో కూడా బీడీ కార్మికులకు పింఛన్లు అమలు చేయడం లేదని ఒక తెలంగాణలోనే అమలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లో గురువారం జరిగిన బీడీ కార్మికుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. బీడీ పరిశ్రమను మరింత బలోపేతం చేస్తామన్నారు. బీడీ పింఛన్ కోసం ఉన్న కటాఫ్ డేట్ 2014ను తొలగిస్తామని అన్నారు. బీడీ కార్మికులకు వైద్య సహాయం అందిస్తామని తెలిపారు. కటాఫ్ డేట్ వల్ల చాలా మందికి పెన్షన్ రావడం లేదన్నారు. రాబోయే రోజుల్లో బీడీ కార్మికులందరికీ పింఛన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.2వేలతో పాటు మరో 2 వేలు కలిపి4వేలు అందజేస్తామన్నా రు. బీడీ కార్మికుల పిల్లలకు విద్య అందే విధంగా చూస్తామన్నారు. ఆసుపత్రుల్లో అభివృద్ధి చేసి వారికి వైద్య సహాయం అందే విధంగా చూస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ధాన్యం మద్దతు ధరను 450 నుంచి 1350 వర కు క్వింటాలుకు పెంచామన్నారు. ఈ పదేళ్ల కాలంలో బీజేపీ అధికారంలో ఉన్న ధరను మాత్రం క్వింటాలుకు 2,200లకే పెంచిందన్నారు. కవిత ఎంపీగా గెలిచిన తర్వాత చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయన్నారు. బీసీలు ఐక్యంగా ఉండి పోరాడాలని లేకుంటే రిజర్వేషన్లను తొలగించే పరిస్థితి ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే రిజర్వేషన్లు కొనసాగుతాయని తెలిపారు. జీవన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, రత్నాకర్, విజయ్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్‌కు ఓటు వేయాలి..

నిజామాబాద్ అర్బన్, మే 2: దళితుల అభివృద్ధిని కాంక్షించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో గురువారం మాదిగ దండోరా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టిందని బీజేపీ నాయకులు దళిత వ్యతిరేకులని ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఏ ఒక్క రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయలేదన్నారు. బీజేపీ దశాబ్ద కాలంలో మాదిగలను మభ్యపెడుతూ మోసం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల నాయకులు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సమావేశంలో కోరారు. అనంతరం నగరంలోని సీఎస్ఐ చర్చిలో తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సమావేశంలో, విజయ్ మున్నూరుకాపు సంఘం సమావేశంలో, పవర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో, 56వ డివిజన్ నజీర్ హోటల్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలీజ్ వజ్, కలెక్టర్

పోలింగ్ నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించాలి

- మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సాధారణ పరిశీలకురాలు

నిజామాబాద్ అర్బన్, మే 2: ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సాధారణ పరిశీలకురాలు ఎలీజ్ వజ్ అర్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ సరళిని సూక్ష్మస్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు గురువారం సమీకృత కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలను కేటాయించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7గంటల సమయానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామగ్రి సక్రమంగా అందిందా లేదా అన్నది పరిశీలన జరుపుకోవాలని అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఒకవేళ ఏజెంట్లు హాజరుకాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసి మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపాల వల్ల ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో వేరే ఈవీఎంలను ఎలా అమరుస్తారో పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి అన్ని అంశాలను గమనిస్తూ ఎప్పటికప్పుడు సాధారణ పరిశీలకులకు తెలియజేయాలని తెలిపారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని 6గంటలలోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన వారి ఓటర్లు ఇంకా మిగిలి ఉంటే వారిని వరుస క్రమంలో నిలబెట్టి చివరి వరకు పోలింగ్ జరపాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

వేసవి తీవ్రత, పట్టణ కేంద్రాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని వివిధ వర్గాల వారి అభ్యర్థన మేరకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఓటర్లను కోరారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్ సందర్భంగా పెరిగిన సమయం అందుబాటులో ఉంటుందని వాస్తవానికి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా ఈసారి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ సమయాన్ని పెంచడం జరిగిందన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు

బ్యాలెట్ యూనిట్ల తరలింపు

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు తరలించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ప్రాథమిక పరిశీలన జరిపిన అనంతరం ర్యాండమైజేషన్ చేపట్టి బ్యాలెట్ యూనిట్లను తరలించారు.

నేటి నుంచి నాలుగు రోజుల పాటు హోం ఓటింగ్

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఈనెల 3, 4, 5, 6 తేదీలలో హోం ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1758 మంది ఓట్ ఫ్రమ్ హోం సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని వీరిలో 85 సంవత్సరాల పైబడిన సీనియర్ సిటీజన్లు 859 మంది, దివ్యాంగ ఓటర్లు 899 మంది ఉన్నారని తెలిపారు. 50 హోం ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేసి ఓటు సేకరణ ప్రక్రియపై శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అత్యవసర విభాగాలకు చెందిన మరో 86 మంది సైతం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

ఎంపీగా గెలిపిస్తే ఏడు నియోజకవర్గాల ప్రజలకు అండగా ఉంటా

- పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి కృషి చేస్తా
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను నమ్మి మోసపోవద్దు
- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇవ్వాలని, ఎంపీగా గెలిస్తే ఏడు నియోజకవర్గాల ప్రజలకు అండగా ఉంటానని, అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆర్మూర్‌లో గురువారం జరిగిన మున్నూరుకాపు, పద్మశాలి, క్షత్రీయ, రజక సంఘాలతో పాటు ఇతర సంఘాలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల కులస్థులకు ఆర్థిక సహాయం అందించిందన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడంతో పాటు కమ్యూనిటీ భవనాలు నిర్మించిందన్నారు. ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి చేశామన్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి మోసపోవద్దని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని వాటిని నమ్మి ఓటు వేస్తే గెలిచిన తర్వాత పట్టించుకోరన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించిన ఇప్పటికీ హామీలను అమలు చేయలేదన్నారు. గెలిచిన తర్వాత ఏ వర్గాన్ని పట్టించుకోలేదన్నారు. తనను గెలిపించి ఢిల్లీకి పంపిస్తే ప్రజలకు నిత్యం అండగా ఉంటానని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి మోసం చేసే నాయకులను నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లాగా కాకుండా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున నిల్చున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు వేస్తే ఐదేళ్ల పాటు పట్టించుకోరని ఆయన అన్నారు. మీకోసం పనిచేసే నాయకుడిగా ముందుకు వచ్చిన తనను ఆదరించాలని కోరారు. మాక్లూర్ మండలం అమ్రాద్ తండా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అన్నీ మోసపూరిత వాగ్దానాలే

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని, మే2: బస్సు హామీ తప్ప కాంగ్రెస్ పార్టీవి అన్నీ మోసపూరిత వాగ్ధానేనని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తగిలేపల్లి గ్రామంలో వంజరి సంఘం అధ్యక్షుడు సయ్యారం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌లో మాజీ సీఎం కేసీఆర్, సిరిసిల్ల, సిద్దిపేటల్లో కేటీఆర్, హరీష్‌రావు కట్టనన్ని ఇళ్లను బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల ఇళ్లను నిర్మించి నెంబర్ 1స్థానంలో నిలిపానని అన్నారు. తగిలేపల్లి గ్రామంలో రూ.4కోట్ల అభివృద్ధి పనులు చేపడితే ముక్కు మొఖం తెలియని వ్యక్తికి 60ఓట్ల మెజారిటీ ఇచ్చి తనకు మైనస్ ఓట్లు ఇవ్వడం మీరిచ్చిన బహుమానం ఇదా అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఎల్లారెడ్డిలో ఏనుగు రవీందర్ రెడ్డి కేవలం మూడు ఇళ్లను మాత్రమే నిర్మించారని అక్కడ మొఖం చెల్లక ఇక్కడ పెత్తనం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. పేదల కోసం నిర్మించిన ఇళ్లకు రూ.400కోట్లు మాత్రమే మంజూరు చేశారని, ఇంకా 26కోట్ల పెండింగ్ బిల్లుల కోసం మంత్రి వద్ద మొర పెట్టుకుంటే ఏనుగు రవీందర్‌రెడ్డి వాటిని ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని వాపోయారు. ఈ విషయంలో మంత్రి సైతం తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత తాను, తన భార్య, కుమారులతో కలిసి పెండింగ్ బిల్లులు వచ్చేవరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలరాజు, నాయకులు పండరి, విండో ఉపాధ్యక్షులు శంకర్, అల్లం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ

● గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

బోధన్ రూరల్, మే2: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఉదయం ఆటో చోరీకి గురైంది. అయితే ఫిర్యాదు అందుకున్న పోలీసులు చోరీ జరిగిన కొన్నిగంటల లోపే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆటోను దొంగలించిన వ్యక్తిని పట్టుకున్నారు. బోధన్‌కు చెందిన ఇస్మాయిల్ టీఎస్16యుబీ6281 అనే వ్యక్తికి చెందినది. ఆటోను అంబేద్కర్‌చౌరస్తాలో నిలిచి బయటపనులకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి వేరే తాళంతో ఆటోను దొంగలించారని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగానే సిబ్బంది అప్రమత్తమై సీసీ ఫుటేజీల ద్వారా అన్నికోణాల్లో దర్యాప్తు చేపట్టి దొంగలించిన ఆటోను ఊట్‌పల్లి గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ప్రజలు తమ వాహనాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆటో దొంగలించిన ఘటనలో వెంటనే పట్టుకున్న పోలీసులను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ, పండ్ల పంపిణీ

వర్ని, మే 2: వర్ని మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ నేమాని నాగమణి వీర్రాజు ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు అరటి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేఏట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి, వర్ని ఎంపీపీ మేక లక్ష్మి వీర్రాజు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు మొయిన్, డీసీసీ డెలిగేట్ గంగాప్రసాద్, రాష్ట్ర మైనారిటీ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ భారీ, గ్రామ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హర్ష, ఉపాధ్యక్షుడు శ్రీను, దామినేని బొజ్జ శ్రీను, నాగరాజు, వంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో మునిగి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్, మే2: ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సాలూర మండల కేంద్రంలోని శివారులో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని శివారులో పొలంలోని నీటికుంటలో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. నాగన్‌పల్లి గ్రామానికి చెందిన మంత్రి సంజీవ్ (40) అనే వ్యక్తి పొలం నీటి కుంటలో బోరుమోటారు తీయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు బుధవారం సాయంత్రం మునిగిపోయ్యాడని, గురువారం ఉదయం కుంటలో శవమై తేలాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

సిరికొండ, మే 2: పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిరికొండ మండలం తూంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏశాల మహేందర్, జింకారాజు, శ్రీకాంత్, భూమగౌడ్, బి.గంగాధర్, లక్షపతి, భిక్షపతి, టి.గంగాధర్, మంగళి రవి, రాజేందర్, రాజుతో పాటు 50 మంది కార్యకర్తలు ఎమ్మెలే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరివెంట జడ్పీటీసీ సభ్యుల మాలవత్ మాన్‌సింగ్ డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్, డీసీసీ నాయకులు బాల్‌రాజ్ నాయక్, తదితరులు ఉన్నారు.

నవీపేటలో యువకుడి అదృశ్యం

నవీపేట, మే 2: మండల కేంద్రానికి చెందిన మ్యాతరి నందు (28) యువకుడు అదృశ్యమయ్యాడని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 29న పొలం వద్ద ధాన్యం తూకాన్ని చూసి రావాలని తండ్రి నర్సయ్య.. నందుకు చెప్పగా అతడు వెళ్లలేదు. దీంతో తండ్రి నర్సయ్య మందలించడంతో.. కోపంతో ఏప్రిల్ 30న బయటకు వెళ్లిన నందు తిరిగి ఇంటికి రాలేదని, అదే రోజున తండ్రికి ఫోన్ చేసి తన కోసం వెతకవద్దని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని తండ్రి నర్సయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోదీ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



నగరంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ధన్‌పాల్

పెద్దబజార్, మే 2: మోదీ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని 15వ డివిజన్‌లోగల అర్సపల్లిలో ఇంటింట ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. యువత కోసం నరేంద్రమోదీ ప్రపంచ స్థాయి విద్యాసంస్థలు ఐఐటీ, ఎయిమ్స్ తీసుకువచ్చారని అన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేరుస్తున్నారని అన్నారు. కట్టెల పొయితో పేద మహిళలకు అనారోగ్య సమస్యలపాలు కాకుండా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా 20కోట్ల కుటుంబాలకు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేశారని అన్నారు. 400 ఎంపీలతో నరేంద్రమోదీ ప్రధానమంత్రిని చేస్తే మన దేశ ఆర్థిక వ్యవస్థను మూడోస్థానానికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జి రమేష్, నవీన్, 95వ బూత్ అధ్యక్షుడు సత్యనారాయణ, పరుశురాం, జగన్, గంగాధర్, నర్సయ్య, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



దేగాంలో చాయ్‌పే చర్చలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే2: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలూర్ మండలం దేగాంలో చాయ్‌పే చర్చ, మచ్చర్లలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇరుపార్టీల నాయకులు కుమ్మక్కై రాజకీయలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులు తాను చేయిస్తానని ఎంపీగా అర్వింద్‌ను గెలిపిస్తే నిధులు పెద్దమొత్తంలో తీసుకువచ్చి మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు నుంచి ప్రతీ గ్రామంలో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టానున్నామని తెలిపారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మరోమారు ప్రదానిగా నరేంద్రమోదీని గెలిపిస్తే ప్రపంచంలోనే భారతదేశం శక్తివంత దేశంగా తయారవుతుందని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. బీజేపీకి ఓటు వేసి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయభారతిరెడ్డి, పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్; బండారి యాదగిరి, అబ్బి గంగారాం, కలిగోట గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● దేశం, ధర్మ రక్షణ కోసం బీజేపీని గెలిపించాలి

బోధన్‌రూరల్, మే2: దేశం, ధర్మ రక్షణ కోసం బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌ను గెలిపించాలని బీజేపీ బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింహ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని పలు వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, మూడోసారి మోడీ ప్రధానమంత్రి కావాలని చూస్తున్నారన్నారు. గత 10సంవత్సరాల కాలంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు. కేంద్రంలో మూడోసారి నరేద్ర మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, సుధాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని గెలిపించాలంటే అర్వింద్‌కు ఓటు వేయాలి

● ఎంపీ అరవింద్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి

రెంజల్,మే2: దేశాన్ని ధర్మాన్ని వైపు నడిపిస్తూ నరేంద్రుడి పాలనలో భారత దేశం సుభిక్షంగా ఉందని, ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ధర్మాన్ని గెలిపించాలంటే మరోసారి బీజేపీకి అధికారం కట్టబెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం రెంజల్ మండల కేంద్రంతో పాటు నీలా గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరవింద్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనులు నిర్వహిస్తున్న చోట అక్కడికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ సంక్షేమాన్ని పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ మరోసారి బీజేపీకి అవకాశం కల్పించాలని సూచించారు. గత పదేళ్లలలో మోడీ పాలనతో అభివృద్ధి చెందిన భారత దేశం మరోమారు ముందుకు వెళ్లాలంటే మూడోసారి నరేంద్ర మోడీని ప్రధానమంత్రి చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అరవింద్ నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు తెచ్చిస్తారని జిల్లాను అన్ని రకాలుగా అరవింద్‌కు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే ఉపాధి కూలీల రేటును 400రూపాయలకు పెంచుతామన్నారు. పేదల అభ్యున్నతికి వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపికృష్ణ, ఎంపీపీ రజిని కిషోర్, వైస్ ఎంపీపీ యోగేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, బీజేపీ ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీనివాస్, పోచయ్య, మాజీ మండల అధ్యక్షుడు చుక్క రాజు, గాండ్ల ప్రసాద్, రాకేష్ రెడ్డి, శివ కుమార్, గంగాదర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ హాస్టళ్లు యధావిధిగా కొనసాగించాలి

● పీడీఎస్‌యూ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకుడు రాజేశ్వర్

డిచ్‌పల్లి,మే 2: తెలంగాణ యూనివర్సిటీ హాస్టళ్లని యధావిధిగా కొనసాగించాలని విద్యార్థులను నుంచి ఎటువంటి మెస్ చార్జీలను వసూళ్లు చేయొద్దని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలు, మరియు ఇతర పరీక్షలు దగ్గరలోనే ఉన్నాయని, పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం తక్కువ ఉన్నందున దూరభారంతో ఇంటికి వెళ్లి చదవలేని పరిస్థితి ఉందని వర్సిటీలో చదువుతున్న విద్యార్థులంత మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులేనని కావున వర్సిటీ హాస్టళ్లను వేసవి సెలవుల దృష్ట్యా మూసివేయకుండా కొనసాగించాలని ఆయన వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, దేవిక, శివసాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాహం తీరేదెలా..

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత
- నిరుపయోగంగా నీటి తొట్టీలు
- మూగ జీవాలకు తప్పని ఇబ్బందులు



కళ్యాణి గ్రామంలో నీరు లేకుండా ఉన్న పశువుల తొట్టి



శుభ్రంగా లేని నీటి తొట్టిలో రంగు మారిన నీరు

ఎల్లారెడ్డి, మే 2 : రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో అడవి ప్రాంతాల్లోని వాగులు, కుంటలు, చెరువులలలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో మూగ జీవాలు దాహార్తిని తీర్చడం కోసం ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్టీలను ఏర్పాటు చేసింది. అందులో నీళ్ళను ట్యాంకుల నల్లాల ద్వారా వాటిలో నీటిని నింపాలి. కాని కొన్ని గ్రామాలలో ఎక్కడికక్కడే నీటితో చెత్తా చెదారంతో వృధాగా దర్శనమిస్తున్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని చాలా గ్రామాలలో ఎటు చూసినా పశువుల కోసం నిర్మించిన నీటితో నీరు లేకపోవడంతో పశువుల దాహం కోసం అలమటిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో పశువుల కోసం కొన్ని వేలు ఖర్చు చేస్తూ నీటి తొట్టీలు నిర్మిస్తే నీరు లేక వృధాగా మారుతున్నాయి. కొన్ని గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నీటి తొట్టీల నిర్మాణం తూతూ మంత్రంగా నిర్మించారు. అవసరం ఉన్న చోట కాకుండా అనవ సరం ఉన్న చోట నీటి తొట్టీలు నిర్మించి అధికారులు చేతులు దులుపు కున్నారు. అయితే సంబంధిత గ్రామ పంచాయితీ సిబ్బంది పశువుల తొట్టీలను పట్టించుకోక నీటిని నింపకపోవడంతో వేసవి కాలంలో పశువులు నీటి కోసం కొట్టుమిట్టాడుతున్నాయి. పలు గ్రామాలలో నిర్మించిన నీటితో పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం, నీటి సరఫరా లేక చెత్తాచెదారంతో నిండి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి తొట్టీలకు మరమ్మతులు చేసి పశువుల తొట్టీలలో నీటిని నింపి మూగజీవాల దాహాన్ని తీర్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన అధికారులు



చంద్రయాన్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ కమీషనర్ వెస్లీ

ఇందల్వాయి, మే 2: ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం డిప్యూటీ కమీషనర్ వెస్లి, డీఆర్‌డీవో సాయాగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. తీవ్రమైన ఎండలు ఉన్నందున ఉదయం తొందరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు 300 రూపాయల కూలీ వస్తుందని చెప్పారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి అధికారులు సరైన నీటి వసతి, నీడ కోసం టెంట్లు వేయిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వారు అడిగిన ప్రశ్నలకు కూలీల నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కూలీకి కొలతల ప్రకారం పని ఇచ్చి వారికి ఎంత కూలీ వస్తుందో వివరంగా చెప్పాలని సూచించారు. వేసవిలో పని చేసిన వారికి అదనపు ఛార్జీలు ఉంటాయని అట్టి విషయం కూలీలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరు రోజుకు కనీసం 200 రూపాయలు కూలీ వచ్చే విధంగా పనులు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుండి అన్ని సౌకర్యాలు ఉంటాయని చేసిన పనికి వారం రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అంబుడ్స్‌మెంట్ శ్రీనివాస్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో అనంత్‌రావు, ఏపీవో పోశెట్టి, పీఏలు మోతిరాం, సుప్రజ, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

గడ్కోల్‌లో ఘనంగా మేడే ఉత్సవాలు



గడ్కోల్లో మేడే ఉత్సవాలను నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సిరికొండ మే 2 : మేడే వారోత్సావాల్లో భాగంగా మండలంలోని గడ్కోల్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఎగుర వేసి అమరులైన కార్మికులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కారల్ మార్క్స్ మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినాల కోసం కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను నేడు నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో గల బీజేపీ ప్రభుత్వం హరించి వేయడంతో పాటు 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. కార్మికుల ఉద్యోగ భద్రను పూర్తిగా మరిచిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేవారు. ప్రతి యేట రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ ఆ ఊసే మరిచిపోయారని ఆయన అన్నారు. కార్మికులు కోల్పోతున్న హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాలని కారల్ మార్క్స్ కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మల భూమేష్,గులాం హుస్సేన్,కృష్ణ,సత్యవ్వ,వసంత,శివరాజ్,సునీత,జ్యోతి, బుజ్జి మల్కి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

● మోదీ సర్కార్‌ను గద్దె దించాలి

మేడే వారోత్సావాల సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గడ్కోల్ గ్రామంలో అరుణా పతాకాన్ని ఎగుర వేసిన అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ, ఉపాధి,పని భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి సమాన సమాన వేతనాన్ని చెల్లించాలని రమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్,కిషోర్,రాములు,ప్రదీప్,రాజేశ్వర్, లత,లావన్యసాయిలు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ నియోజక వర్గంలో బూత్ కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, మే 2: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ కార్యకర్తలను సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూరల్ నియోజకవర్గం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో బూత్ కమిటీలను నియమించారు. 15 బూత్ కమిటీలకు ఐదుగురు సభ్యులను నియమించడం జరిగిందని ప్రతిరోజు వీరు ఉపాధి హామీ కూలీల దగ్గరికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వారికి వివరించాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజు గ్రామంలో ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం ముఖ్య నాయకులు, సొసైటీ ఛైర్మన్లు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

ముప్కాల్: మండలంలోని రెంజర్ల, వేంపల్లి, నాగంపేట్, కొత్తపల్లి గ్రామాలలో ఉపాధి హామీ కూలీలను కలిసి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపిస్తే రైతులు, బడుగు బలహీనవర్గ, కులాల గలం పార్లమెంట్‌లో వినిపిసారని ఆయన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీలో నాలుగు గ్యారంటీలు ఇప్పటికే అమలు చేశారన్నారు. మిగతా వాటిని కూడా ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేయబోతున్నామని ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని రాబోయే రోజుల్లో ఉపాది హామీ కూలీలకు రూ.12వేలు ప్రభుత్వం చెల్లించబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ సెక్రెటరీ జైడి చంద రవి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం రెడ్డి, నర్సారెడ్డి, మహిపాల్, శ్రీకాంత్, రాజు, వెంకట్, మహేష్, రాజన్న, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

● కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

బోధన్‌రూరల్,మే2: తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్‌లు అన్నారు. గురవారం బోధన్ మండలంలోని ఊటపల్లి, అమ్దాపూర్, తదితర గ్రామాలలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామాల్లోని ఇంటింటా తిరుగడంతో పాటు ఉపాధి హామీ కూలీలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తుందని అలాగే కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మాజీ సోసైటీ ఛైర్మన్ పోరెడి గంగాధర్, సాయిలు, దండు సాయిలు, నరేష్, బొర్ర పల్లన్న, అశోక్, నర్సయ్య, ఖదర్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీసర్పంచ్ మంగళవారం పోశన్న బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డి గురువారం పోశన్నకు కాంగ్రెష్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, గణేష్‌గౌడ్, ఉద్ద చిన్నయ్య, నవీన్‌రెడ్డి, గంగారెడ్డి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలి

రెంజల్,మే2: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ ఆధ్వర్యంలో దూపల్లి, దండిగుట్ట గ్రామాలలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోను వివరించారు. ఆరు గ్యారంటీల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో ప్రజలు ఉపాధి పొందుతున్నారని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ ఛైర్మన్ ధనుంజయ్, మాజీ మండల అధ్యక్షులు సీహెచ్ రాములు, సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్, మాజీ సర్పంచ్‌లు సురేందర్ గౌడ్, జావీదోద్దీన్, నాయకులు సాయిబాబా గౌడ్, పోచయ్య, మోహన్, షంషోద్దీన్, సిద్ద సాయిలు, పురం నర్సయ్య, ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ఆలూర్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే2: కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని ప్రజలను మోసగించేందుకు మరోసారి ముందుకు వస్తున్నాయని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం రాత్రి ఆలూర్ మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళల సేవలందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్. సురేష్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, రాజారాంయాదవ్, జడ్పీటీసీ మెట్టు సంతోష్, మాజీసర్పంచ్ కల్లెం మోహన్, ఎంపీటీసీ బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● హామీల అమలులో కాంగ్రెస్, బీజేపీలు విఫలమే: ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు పూర్తిగా విఫలమయ్యాయని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని తిమ్మాపూర్, దొన్కల్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి దర్మ పురి అర్వింద్ తమ పదవి కాలంలో ప్రజల వద్దకు రాలేదని, ప్రజల సమస్యలు పట్టించుకోలేదని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మనిషి, ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీసర్పంచ్ చిన్నారెడ్డి, సొసైటీ ఛైర్మన్ గడ్డం పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్‌ను పోలీసులకు అప్పగింత

ఖిల్లా, మే 2: నగరంలో గొలుసు దొంగతనాలు పెరిగి పోతున్నాయి. ఇటీవల నగరంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం సమీపంలో ఆటో దిగుతున్న మహిళ మెడలో నుంచి 2న్నర తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి అపహరించిన ఘటనను మరువక ముందే నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో గల రామాలయం వద్ద గురువారం మరో బంగారుగొలుసు అపరహరణ యత్నిస్తున్న ఘటన జరిగింది. నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సిహెచ్.పుష్ప తన మనువరాలితో కలిసి రామాలయానికి వచ్చింది. గుడిలో దర్శణం చేసుకుని బండి ఎక్కి వెళ్తుండగా నడుచుకుంటూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె దృష్టిని మరల్చి ఆమె మెడలో నుంచి గొలుసు అపహరించేందుకు యత్నించగా గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమై ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విచారణ జరిపి కేసునమోదు చేస్తామని ఎస్ఐ. ఎల్.ప్రవీణ్ తెలిపారు.

దివ్యాంగులను సంఘటితం చేయడమే లక్ష్యం

సిరికొండ మే 2: అసంఘటితంగా ఉన్న దివ్యాంగులను సంఘటితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని నూతనంగా మండల దివ్యాంగుల అధ్యక్షుడిగా ఎన్నికైన రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.గురువారం సిరికొండలో సమావేశమైన దివ్యాంగులందరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సంఘటితం చేసి తమకు తాముగా ఒకరికొకరు సహాయం చేసుకునేలా చూస్తామన్నారు. దివ్యాంగులంటే సమాజం చాలా చిన్న చూస్తూ సహాయ సహకారం చేయడానికి వెనుక ముందు ఆలోచిస్తున్నారని అన్నారు. తాము ఏర్పాటు చేసుకున్న సంఘం నెల నెల సమావేశం నిర్వహించి బలోపేతం అవుతామన్నారు. తమను తాముగా ఆదుకోవడానికి పలు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యక్షుడిగా రాజశ్రీ,ప్రధాన కార్యదర్శిగా లింగం, సహాయ కార్యదర్శిగా విజయ్, శాధికారిగా బోయిడి మంజులను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో సఫీయా బేగం,అరుణా జ్యోతి,అంబర్‌లాల్,ప్రశాంత్,పోతన్న, అమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి

● పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

డిచ్‌పల్లి, మే 2: వేసవి ఎండల దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడ కూడా తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్‌లోని ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, పారిశుధ్యం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఇంటి పన్నుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు టెంట్లు, మరియు తాగడానికి మంచినీటిని అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్, మెడికల్ కిట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమీక్ష సమావేశంలో డీపీవో తరుణ్ కుమార్ చక్రవర్తి, డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, డిచ్‌పల్లి ఎంపీడీవో రవీందర్, ఇందల్వాయి, ధర్పల్లి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా ఈ పంచాయతీ డీపీఎం నరహరి, పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాల మెరిట్ లిస్ట్ విడుదల

డిచ్‌పల్లి, మే 2: ఆదర్శ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ ఫలితాలు గురువారం విడుదల అయ్యాయని డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న జరిగిందని తెలిపారు. మెరిట్ లిస్ట్ మాత్రమే విడుదల అయిందని, రిజర్వేషన్, మరియు లోకల్ విద్యార్థుల సంఖ్యను బట్టి చివరి సెలక్షన్ లిస్ట్‌ను త్వరలోనే అందుబాటులో ఉంచుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రెంజల్ ఎంపీడీవోగా శ్రీనివాస్

రెంజల్,మే2: రెంజల్ మండల ప్రజా పరిషత్ డెవలప్‌మెంట్ అధికారిగా గురువారం హెచ్.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఎంపీడీవోగా పని చేసిన శంకర్ ఎడపల్లికి వెళ్లగా సూపరిండెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌కు ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించడంతో గురువారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో శ్రీనివాస్‌కు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇందల్వాయి, మే 2: ఇందల్వా యి మండలంలోని దేవితండా వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నగరానికి చెందిన మాధురి, అశోక్ కారులో హైదరాబాద్ నుండి నిజామాబాద్ వస్తుండగా దేవితండా వద్ద వారు ప్రయాణిస్తున్న కారు కల్వర్టును ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో మా ధురి, అశోక్‌లకు తీవ్రగాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. ఇందు లో మాధురి పరిస్థితి విషమంగా ఉందని వారిని టోల్‌ప్లాజా అంబు లెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంపై పోలీసులను వివరణ కోరగా తమకు సమాచారం అందలేదని తెలిపారు.

'బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి'



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మే 2: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని 50వ డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు పేరు చెప్పి గెలిచి ఐదు సంవత్సరాలు జిల్లాకు ఏమి చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అబద్దాలు చెబుతూ హిందూ, ముస్లీం మధ్య విబేదాలు సృష్టించి ఓట్లు దండుకుంటుందన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండునీతూకిరణ్, సదానంద్, ప్రభాకర్‌రెడ్డి, సిర్పరాజు, సుజిత్‌సింగ్, సత్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని ఆశీర్వదించండి: ఎమ్మెల్యే



గోన్‌గొప్పులలో ఉపాధిహామీ కూలీలతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్‌రూరల్,మే 2: భీమ్‌గల్ మండలంలోని గోన్‌గొప్పుల, సికింద్రా పూర్ గ్రామాలలో గురువారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఉదయం పూట కొనసాగుతున్న ఉపాధిహామీ కూలీల దగ్గరకు వెళ్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు తోడు దొంగల పార్టీలని వారికి ఓటు వేస్తే ప్రయోజనం లేదన్నారు. కేసీఆర్ బలపరిచిన గోవర్ధన్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు ఓటు అడిగే హక్కులేదని పసుపు రైతులు గ్రామాల్లో తిరగబడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి నమ్మే పరిస్థితుల్లో బాల్కొండ నియోజకవర్గ ప్రజలు లేరని తెలిపారు.

తిమ్మాపూర్‌లో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం



తిమ్మాపూర్‌లో శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

మోర్తాడ్, మే2: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. జిల్లా యోజన, క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వ్యాయమ ఉపాధ్యాయులు డి.శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మెలకువలు నేర్చుకోవాలని, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మురళీ, సీనియర్ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూపై వస్తున్న వదంతులు నమ్మవద్దు

● ఎన్ఎస్‌యూఐ నాయకులు

డిచ్‌పల్లి, మే 2: ఉస్మానియా యూనివర్సిటీలోని హాస్టళ్లలో విద్యుత్ మరియు నీటి కొరత తో హాస్టళ్ల మూసివేస్తున్నరనే వదంతులను నమ్మొద్దని టీయూ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు సాగర్ నాయక్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ యూనివర్సిటీలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రతీ ఏడాది లాగానే ఓయూకి ఈసారి సెలవులు ప్రకటించారని కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు.యూనివర్సిటీలో ఎలాంటి తాగునీటి, విద్యుత్ కొరత లేదని ప్రిన్సిపాల్ సెక్రటరీ, విద్యాశాఖ వారితో చర్చించకుండా సర్క్యులర్ జారీ చేసిన హాస్టల్ చీఫ్ వార్డెన్‌కు ఇప్పటికే ఓయూ అధికారులు నోటీస్ ఇచ్చారని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటికే ఓయూ వీసీహాస్టళ్లను కొనసాగిస్తున్నట్లు సర్క్యులర్ సైతం జారీ చేశారని పేర్కొన్నారు. ఈవిలేకర్ల సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయ కు లు సందీప్,లింగస్వామి,చందర్,సంజయ్, వినోద్ రాజేశ్ తదితరులు ఉన్నారు.



టీయూలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

సుభాష్‌నగర్, మే 2: వేసవి కాలంలో విద్యుత్ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయనున్నట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్ సబ్‌స్టేషన్ నోడల్ ఆఫీసర్ అశోక్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ అశోక్ నిరంతర విద్యుత్ కోసం చేసిన పనులపై అధికారులను ఆరా తీశారు. నిజామాబాద్ పట్టణ పరిధిలో ఉన్న గృహ, వాణిజ్య, ఇతర వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా ఓవర్ లోడ్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. లోడ్ ఎక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి వినియోగదారులకు ఓవర్ లోడ్ సమస్యను ఇక్కడి అధికారులు తీర్చాలన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ముప్కాల్ సెక్షన్‌లో వినియోగదారులులో వోల్టేజీ సమస్య రాకుండా ఉండటం కోసం కొత్తగా 33/11 కేవీ నల్లూరులో సబ్‌స్టేషన్‌ను రూ.2కోట్లతో ముప్కాల్ సెక్షన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డి1 సెక్షన్‌లోని సమస్యల కోసం 8500399877, డి2- 8462222402, డి3- 9493546509, డి4- 9491074572, డి5- 9491075409, డి6- 9491075408, బోర్గాం 9493546522, నాగారం 8500399877, సుభాష్‌నగర్ 7382742124 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్, టౌన్-2 తోటరాజశేఖర్, టౌన్-3 ఏడీఈ వీరేశం, సిబ్బంది పాల్గొన్నారు.

కోనాసముందర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగల స్వాధీనం



టేకును కమ్మర్‌పల్లి రేంజ్‌కు తరలించిన అటవీశాఖ అధికారులు

కమ్మర్‌పల్లి,మే 2: మండంలోని కోనాసముందర్ గ్రామశివారుల్లో ఎలాంటి అధారాలు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన సుమారు రెండున్నర లక్షల విలువగల టేకుదుంగలను కమ్మర్‌పల్లి అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో రవీందర్ మాట్లాడుతూ..పక్కా సమాచారం మేరకు కోనాసముందర్ గ్రామశివారుల్లో అక్ర మంగా నిలువుంచి టేకుదుంగలు కనిపించాయని ఎవరివని ఆరాతీయగా చుట్టుపక్కల ఉన్న వడ్రంగుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో వారందరిపై అనుమానాస్పద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ టేకు కలప చుట్టపక్కల అడవీప్రాంతాలనుంచి తెచ్చినదా లేదా పంటభూముల నుంచి సేకరించి నిలువ ఉంచినదా తెలాల్సి ఉందన్నారు. కాగా పట్టబడిన కలపతో పాటు చుట్టుపక్కల వడ్రంగుల కోతమిషన్లు పనిముట్లలను సైతం స్వాధీనం చేసుకుని కమ్మర్‌పల్లి రేంజ్ కార్యాలయానికి చౌట్‌పల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప కొలతలు వేసి పైఅధికారులకు నివేదించనున్నట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. డీఆర్‌వో తుకారాం రాథోడ్, సెక్షన్ ఆఫీసర్ రాజు, బీట్ ఆఫీసర్లు నవీన్ రాజ్, లింగన్న, సతీష్, సునీత, రజిత, బెస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ మనందరి బాధ్యత

ఇదిలా ఉండగా ప్రభుత్వం అటవీశాల ద్వార అడవుల పెంపకానికి కోట్లల రూపాయలు వెచ్చిస్తున్నదని కొందరు స్మగ్లర్లు సిబ్బంది కళ్లుగప్పి విలువైన కలప తరలించుకుపోతున్నారని ఈ విషయాలను అయా గ్రామాల ప్రజలు అటవీ శాఖ సిబ్బందికి చేరవేయాలని అందరి సంరక్షణతోనే అడవులు అభివృద్ధి చెందుతాయని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ సిబ్బంది తగు సహకారం, స్మగ్లర్ల సమాచారం అందివ్వాలని కోరారు.

\- ఎఫ్ఆర్‌వో రవీందర్

ఉపాధి హామీ కూలీలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

డొంకేశ్వర్, మే2: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియాను అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ డిమాండ్ చేశారు. గురువారం డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీతో మేడే కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు ఆరా, గడ్డపార, పరికరాలను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలను అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. కూలీ డబ్బులను వెంటనే ఇబ్బందులు లేకుండా చెల్లించాలని అన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మోపాల్, మే 2: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన రైతు సాయిలు (50) అప్పుల బాధ భరించలేక గురువారం ఉదయం తన పొలంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. సాయిలుకు ముగ్గురు కూతుళ్లు ఉండగా, ఇద్దరు పెళ్లిలు అయ్యాయి. మరో కూతురు ఉంది. ఇతనికి సుమారు 7 నుంచి 8 లక్షల రూపాయల అప్పులు ఉన్నాయని తెలిపారు. మానసికంగా అనారోగ్యంతో గత కొన్ని రోజుల నుంచి బాధపడుతున్నాడని తెలిపారు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి ఎస్సై చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

సెల్ఫీ పాయింట్‌ల ఏర్పాటు



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్, స్వీప్ నోడల్ ఆఫీసర్

ఆర్మూర్‌టౌన్, మే2: మున్సిపల్ పరిధిలోని పలుప్రాంతాల్లో ఫోటో ఆవశ్యకతను తెలిపేలా గురువారం నాలుగు సెల్ఫీ పాయింట్ లను ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ స్వీప్ నోడల్ ఆఫీసర్ రాజుతెలిపారు.ప్రతీ ఒక్కరు తమ ఓటు వినియోగించు కోవాలని ప్రజలకు ఆయన సూచించారు. ఈకార్య క్రమంలోమున్సిపల్ డీఈ భూమేశ్వర్, ఏఈ రఘు, సానీ టరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, పూర్ణ మౌళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కరపత్రాల పంపిణీ

డొంకేశ్వర్, మే2: డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి, చిన్నయానం, నడ్కుడ గ్రామాలలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్ కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రజల కోసం పని చేస్తున్న ప్రధాని మోదని మరోసారి ఆశీర్వదించి అర్వింద్‌ను గెలిపించాలని ఆయన కోరా రు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేం దర్, ఎంపీటీసీ సంజీ వ్, చిన్నారెడ్డి, ఓబీసీమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులందరికీ వేతనాలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, మే 2: బీడీ కార్మికులందరికి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. గురువారం నగరంలోని గాజుల్‌పేట్‌లోగల బీడీ కంపెనీ యజమానుల సంఘం అధ్యక్షుడు ప్రకాశ్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్‌గాంధీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ 30 ఏప్రిల్ 2024 వరకు వేతన ఒప్పందం ముగిసిందన్నారు. వెంటనే వేతన ఒప్పందం చేసి మే 1 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.400 ఇవ్వాలని, బీడీ ప్యాకర్లు, నెలసరి జీతాల ఉద్యోగులైన సార్టర్, ఆకు, తంబాకు పంచే వారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాలా, చెన్నివాల, గంపవాల, వాచ్‌మెన్‌లకు ప్రస్తుత వేతనం పై 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కరువు భత్యం రేటు పాయింట్‌కు 10పైసల నుంచి 30 పైసల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరేందర్, రాజన్న, రాజేశ్వర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలో వైద్య శిబిరం



గుడితండాలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మోపాల్, మే 2: మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గుడితాండాలో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 96 మంది రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య సిబ్బంది వారికి సూచించారు. అత్యవసర సమయాల్లోనే బయటకు వెళ్లాలని ఎండ తీవ్రత తీవ్రంగా ఉందని అన్నారు. ఎండదెబ్బ తగిలితే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామస్తులు సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు అలేఖ్య, సంతోష్‌కుమార్, నజీమ్ అహ్మద్ ఖాన్, శ్రీకాంత్, సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధులు ఆశావర్కర్లు, పంచాయతీ సెక్రెటరీ, తాండా వాసులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



డిచ్‌పల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి,మే 2: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ని డిచ్‌పల్లిలో గురు వారం నిర్వహించారు. మండల కేంద్రంలోని నాగపూర్‌గేట్ నుంచి రైల్వే స్టేషన్ గుండా నడిపల్లి వరకు ఈఫ్లాగ్ మార్చ్‌ని జరిగింది.ఘన్‌పూర్, ఇస్లాంపుర, ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.ఈఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐమల్లేశ్, ఎస్సై మహేశ్ అధికారులు పాల్గొన్నారు.

మంచిప్పలో పోలీసుల కవాతు

మోపాల్, మే 2: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు గురువారం ఉదయం మండలంలోని మంచిప్ప గ్రామంలో కవాతు నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా పోలీసులు ఈ కవాతులో పాల్గొన్నారు. గ్రామస్తులందరూ తమఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



కోటగిరిలో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కోటగిరి,మే2:విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని మండల ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో గురువారం విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏఈ కృష్ణ మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో మోటార్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.చిన్న అజాగ్రత్త ప్రమాదాలకు దారి తీస్తోందని అన్నారు.విద్యుత్ పట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు,విద్యుత్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు

జక్రాన్‌పల్లి, మే2: మండలంలోని మనోహరాబాద్, పడకల్ గ్రామాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా వారి ఇంటి వద్ద మద్యం అమ్ముతున్న పక్క సమాచారం మేరకు బుధవారం రాత్రి దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు మనోహరాబాద్ గ్రామానికి చెందిన రొడ్డ రాజేశ్వర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇంటి వద్ద మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు దాడి అతని వద్దని రూ.11వేల870 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పడకల్ గ్రామానికి చెందిన యాటకార్ల శ్రీకాంత్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి వద్ద మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు దాడి చేయగా అతని వద్ద రూ.10వేల471 విలువైన మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

5న కబడ్డీ జిల్లా కార్యవర్గ సమావేశం

సుభాష్‌నగర్, మే 2: ఈనెల 5వ తేదీన కబడ్డీ జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రెటరీ లింగయ్య తెలిపారు. నగరంలోని డీఎస్ఏ మైదానంలో ఉదయం 10గంటల నుంచి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గతంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశాలపై చర్చ, గత నాలుగు సంవత్సరాల్లో సంఘ కార్యక్రమాల నివేదిక ఆమోదంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

టీయూ గ్రంథాలయంలో నూతన పుస్తకాలు ఉంచాలి

● గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన టీయూ విద్యార్థి నాయకులు



గ్రంథాలయ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,మే2:టీయూలోని లైబ్రరీలో విద్యార్థులకు పోటీపరీక్షలకు సంబంధించిన అన్నిరకాల పుస్తకాల ను అందుబాటులోఉంచేలా చర్యలు తీసు కోవాలని గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్‌కు వర్సిటీ విద్యార్థి నాయకులు వినతి పత్రం అందజే శారు. వేసవి సెలవులతో సంబంధం లేకుండా హాస్టళ్లని కొనసాగించాలని, లైబ్రరీలో వసతులు పెంచాలని, కంప్యూటర్ సౌక ర్యాలు కల్పించా లని, కోరారు. ఈ కార్యక్ర మంలో వర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి అధ్యక్షు డు శ్రీను రాథోడ్, సాగర్ నాయక్, రాజు, కార్తీక్, శ్రీహరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఏసీపీ

జక్రాన్‌పల్లి, మే2: పార్లమెంట్ ఎన్నికలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని తమ ఓటు హక్కును వినియోగించుకోవాని నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలల్లో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏసీపీ పోలీసులకు సూచనలు చేశారు. ఏసీపీ వెంట ఎస్సై సీహెచ్.తిరుపతి, పోలీసులు ఉన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,700	రూ.65,100	రూ.840

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
: టిల్లు స్క్వేర్ (4.30)
: బాక్ (10.40)
స్క్రీన్-2 : ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)
స్క్రీన్-3 : ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
: శబరి (7.20)
స్క్రీన్-4 : బాక్ (1.10)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 7.35, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : బాక్ (10.40, 10.35)
: మంజుమ్మల్ బాయ్స్ (1.40)
: శబరి (7.25)
స్క్రీన్-3 : శబరి (10.40)
: ప్రసన్నవదనం (1.30, 10.40)
: బాక్ (4.35, 7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : వకీల్ సాబ్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బాక్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : ఆ ఒక్కటి అడక్కు (11.15, 2.15, 6.15, 9.15)



\- నిజామాబాద్ అర్బన్